క్లుప్తంగా

కేశంపేట మండల ప్రత్యేకాధికారిగా గోపికృష్ణ



గోపికృష్ణను సన్మానిస్తున్న మాజీ ప్రజాప్రతినిధులు

కేశంపేట: మండల ప్రత్యేక అధికారిగా జిల్లా సివిల్ సప్లయ్ డీఎం గోపికృష్ణ బాధ్యతలు స్వీకరించారు. గతంలో మండల ప్రత్యేకాధికారిగా విధులు నిర్వహించిన షాద్‌నగర్ ఏడీఏ రాజారత్నం పదోన్నతిపై వెళ్లడంతో గోపికృష్ణను ప్రభుత్వం నియమించింది. దీంతో బుధవారం ఆయన మండల ప్రత్యేక అధికారిగా బాధ్యతలు స్వీకరించడంతో వివిధ పార్టీల నాయకలు, ఉద్యోగులు ఆయనను సన్మానించారు. కార్యక్రమంలో కేశంపేట మాజీ సర్పంచ్ శ్రీధర్‌రెడ్డి, ఇన్‌చార్జి ఎంపీడీఓ కిష్టయ్య, పంచాయతీ రాజ్ ఉద్యోగులు ఉన్నారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవాలు



వ్రతాల్లో పాల్గొన్న భక్తులు

షాద్‌నగర్‌రూరల్: పట్టణంలోని పరిగి రోడ్డులో గల శ్రీరమా సహిత సత్యనారాయణస్వామి దేవాలయ 22వ వార్షికోత్సవాలు ఆలయ ధర్మకర్త కట్ట ప్రవీణ్ ఆధ్వర్యంలో ఘనంగా కొనసాగుతున్నాయి.ఉత్సవాల ముగింపుసందర్భంగా బుధవారం దేవాలయంలో సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలను నిర్వహించారు. ఆలయ అర్చకుడు రాఘవేంద్రాచార్యుల బృందం దంపతులతో వ్రతాలు, ప్రత్యేక పూజా కా ర్యక్రమాలు చేయించారు. అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో పుర ప్రముఖులు, ఉత్సవ కమిటీ సభ్యులు, కాలనీవాసులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

క్రీడా పాఠశాలల్లో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోండి

కొత్తూరు: ఆసక్తి ఉన్న విద్యార్థులు క్రీడా పాఠశాలల్లో నాలుగో తరగతుల్లో చేరడానికి దరఖాస్తులు చేసుకోవాలని మండల విద్యాధికారి అంగూర్‌నాయక్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తు చేసుకునే విద్యార్థుల వయస్సు ఎనిమిది నుంచి తొమ్మిదేళ్లలోపు ఉండాలన్నారు. హకీంపేట్, కరీంనగర్, అదిలాబాద్‌లో ఉన్న పాఠశాలల్లో చేరడానికి మూడు అంచెల్లో ఎంపిక విధానం ఉంటుందన్నారు. ఈ పోటీలకు ఎంపిక కావడానికి కొత్తూరు జెడ్పీ హెచ్ఎస్ పాఠశాల ఆవరణలో ఈ నెల 19న క్రీడలను నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు ఫోన్ నంబర్లు 9963081675 నవనీత, 9704941074 శ్రీలత, 93929170 మోనాలిసా వ్యాయామ ఉపాధ్యాయులను సంప్రదించాలని కోరారు.

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి



మొక్కలు నాటుతున్న విశ్వకర్మ మండల అధ్యక్షుడు నర్సింహాచారి, ఉపాధ్యాయులు

మొయినాబాద్‌రూరల్: ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని విశ్వకర్మ మండల గౌరవ అధ్యక్షుడు నర్సింహాచారి అన్నారు. బుధవారం మండల పరిధిలోని అమ్డాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హెచ్ఎం రేణుక ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

23న తైబజార్ వేలం

షాబాద్: ఈ నెల 23వ తేదీన సర్దార్‌నగర్ మార్కెట్‌కు తైబజార్ వేలం పాట నిర్వహిస్తున్నట్లు పంచాయతీ కార్యదర్శి విజయ్‌సింహ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జీపీ కార్యాలయంలో తైబజార్ వేలం పాట నిర్వహిస్తామని, పాల్గొనేవారు ప్రవేశ రుసుము రూ. 2వేలు ఎస్‌బీఐ బ్యాంకు సర్దార్‌నగర్‌లో డిమాండ్ డ్రాఫ్టు తీసి కార్యదర్శికి అందజేయాలని సూచించారు.

పరామర్శ

షాబాద్: కష్టాల్లో ఉన్న ప్రతీ కార్యకర్తకు అండగా ఉంటామని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎలుగంటి మధుసూదన్‌రెడ్డి అన్నారు. బుధవారం మండల పరిధిలోని ముద్దెంగూడకు చెందిన పర్వేద సుధాకర్ అనారోగ్యంతో ఆస్పత్రిలో చికిత్స పొంది ఇంటికి వచ్చాడు. విషయం తెలుసుకున్న ఆయన సుధాకర్‌ను పరామర్శించారు. కార్యక్రమంలో నాయకులు తదితరులు ఉన్నారు.

భూభారతితో సమస్యల పరిష్కారం

- జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మధుసూదన్‌రెడ్డి
- రైతుల నుంచి అర్జీల స్వీకరణ



షాబాద్: తాళ్లపల్లిలో రైతు సమస్యలపై వివరాలు అడిగి తెలుసుకుంటున్న మధుసూదన్‌రెడ్డి

షాబాద్: భూ సమస్యలను సత్వరమే పరిష్కరించాలనే కృతనిశ్చయంతో ప్రభుత్వం భూభారతి రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తోందని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎలుగంటి మధుసూదన్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం మండల పరిధిలోని తాళ్లపల్లిలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ చట్టం ద్వారా భూ సమస్యల పరిష్కారానికి సత్వర చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అధికారులు రైతుల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న తీరును పరిశీలించారు. రైతుల సమస్యలను అడిగి తెలుసుకొని సందేహాలను నివృత్తి చేశారు. భూ భారతి విధి విధానాలు, చట్టంలో పొందుపర్చిన అంశాలపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఎండీ అన్వర్, డిప్యూటీ తహసీల్దార్ మధు, గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కావలి చంద్రశేఖర్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ సంజీవరెడ్డి, మాజీ ఎంపీటీసీలు కుమ్మరి చెన్నయ్య, గుండాల అశోక్, మాజీ సర్పంచ్‌లు పెంటయ్య, మాణిక్యంగౌడ్, పార్టీ సీనియర్ నాయకులు చేవెళ్ల స్వామి, శ్రీనివాస్‌రెడ్డి, సుభాష్‌రెడ్డి, అంజయ్య, శేఖర్, మాధవరెడ్డి, గౌరీశ్వర్, తదితరులు ఉన్నారు.

సత్వర పరిష్కారానికి కృషి

షాద్‌నగర్: భూ సమస్యల సత్వర పరిష్కారం కోసమే ప్రభుత్వం రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తోందని మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బాబర్‌ఖాన్ అన్నారు. ఫరూఖ్‌నగర్‌లో తహసీల్దార్ పార్థసారధి ఆధ్వర్యంలో బుధవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సంతర్భంగా అధికారులు రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు బాల్‌రాజ్‌గౌడ్, మాజీ కౌన్సిలర్ సర్వర్‌పాషా, మహ్మద్ ఇబ్రహీం, గంగమోని సత్తయ్య, శ్రీనివాస్‌రెడ్డి, రెవెన్యూ సిబ్బంది, రైతులు తదితరులు పాల్గొన్నారు.



షాద్‌నగర్: రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్న తహసీల్దార్ పార్థసారధి

సద్వినియోగం చేసుకోవాలి

మొయినాబాద్: గ్రామాల్లో నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ గౌతమ్‌కుమార్ అన్నారు. మండల పరిధిలోని నాగిరెడ్డిగూడలో బుధవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. వివిధ భూ సమస్యలకు సంబంధించి 37 దరఖాస్తులు వచ్చాయని ఆయన తెలిపారు. కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ సురేందర్, మాజీ సర్పంచ్ సద్గుణాచారి, రెవెన్యూ సిబ్బంది, రైతులు తదితరులు పాల్గొన్నారు.

ముర్తుజాగూడలో..

మొయినాబాద్‌రూరల్: మండలంలోని ముర్తుజాగూడలో మండల డిప్యూటీ తహసీల్దార్ వినోద్‌కుమార్ ఆధ్వర్యంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు రైతుల నుంచి అర్జీలు స్వీకరించారు. కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది, నాయకులు, రైతులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న రెవెన్యూ సదస్సులు

కేశంపేట: కేశంపేటలో తహసీల్దార్ అజాం అలీ, కాకునూర్‌లో నాయబ్ తహసీల్దార్ గీత ఆధ్వర్యంలో బుధవారం రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. ఆయా కార్యక్రమాల్లో ఆర్ఐలు చెన్నకేశవులు, నివేదిత, సీనియర్ అసిస్టెంట్ మచ్చేందర్, మాజీ సర్పంచ్‌లు వెంకట్‌రెడ్డి, శ్రీధర్‌రెడ్డి, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలి



చేవెళ్ల: కుమ్మెరలో రైతుల దరఖాస్తులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కాలె యాదయ్య

చేవెళ్ల: రైతులకు సంబంధించిన భూ సమస్యలన్నింటినీ వెంటనే పరిష్కరించాలని రెవెన్యూ అధికారులను ఎమ్మెల్యే కాలె యాదయ్య ఆదేశించారు. బుధవారం మండలంలోని కుమ్మెర, తలారం, ఎన్కేపల్లి గ్రామాల్లో సదస్సులు కొనసాగాయి. కుమ్మెరలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా రైతులు అందిస్తున్న ఫిర్యాదులను గురించి అడిగి తెలుసుకున్నారు. రైతులకు సంబంధించి ఎలాంటి సమస్యలు పెండింగ్‌లో లేకుండా చూడాలన్నారు. ఫిర్యాదులు చేసిన అన్నింటినీ పరిశీలించి వెంటనే పరిష్కరించాలని సూచించారు. కుమ్మెరలో 37, ఎన్కేపల్లిలో 14, తల్లారంలో 14 ఫిర్యాదులు వచ్చినట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ కృష్ణయ్య, నాయకులు పాండు, వీరేశం, రైతులు, అధికారులు, ప్రజలు పాల్గొన్నారు.

ఫీజుల పేరుతో దోపిడీ



ఎంఈఓకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

- ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీకాంత్

షాద్‌నగర్‌రూరల్: అధిక ఫీజులు వసూలు చేస్తూ ప్రభుత్వ నిబంధనలు పాటించకుండా ఇష్టారాజ్యంగా నడుపుతున్న ప్రైవేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీకాంత్ డిమాండ్ చేశారు. బుధవారం ఈ మేరకు ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీకాంత్ ఆధ్వర్యంలో నాయకులు ఎంఈఓ మనోహర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విద్యార్థులకు అధునాతన సౌకర్యాలు, మౌలిక వసతులు, నాణ్యమైన విద్యనందిస్తామని ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు అధిక ఫీజులను వసూలు చేస్తూ తల్లితండ్రులపై భారం మోపుతున్నారని ఆరోపించారు. నోట్‌బుక్స్, పుస్తకాలు, యూనిఫామ్స్‌తో పాటుగా సామగ్రిని మా పాఠశాలలోనే కొనాలని ప్రైవేట్ యాజమాన్యాలు తల్లితండ్రులను ఒత్తిడికి గురి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కొన్ని ప్రైవేట్ పాఠశాలలు ఒక పేరుతో అనుమతులను తీసుకొని, మరొక పేరుతో పాఠశాలలను నడుపుతూ విద్యార్థులను, తల్లితండ్రులను మోసం చేస్తున్నారన్నారు. నిబంధనలు పాటించని ప్రైవేట్ పాఠశాలలపై తక్షణమే చర్యలు తీసుకోవాలని, లేని పక్షంలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో పెద్దఎత్తున ఆందోళన కార్యక్రమాలను చేపడతామని హెచ్చరించారు. వినతిపత్రం అందజేసిన వారిలో ఎస్ఎఫ్ఐ నాయకులు శివశంకర్, వినయ్, తరుణ్ తదితరులు ఉన్నారు.

'ఉపాధి హామీ'ని పక్కాగా అమలు చేయాలి

- ఎంపీడీఓ వెంకయ్య

శంకర్‌పల్లి: మండలంలో ఉపాధి హామీ పథకాన్ని పక్కాగా అమలు చేయాలని ఎంపీడీఓ వెంకయ్య అన్నారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లకు ఒకరోజు శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉపాధి హామీ పథకంపై ప్రతి ఒక్కరూ సమగ్రంగా అవగాహన చేసుకొని, గ్రామాల్లో విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. పండ్ల తోటలు పెంచుకునే రైతులను గుర్తించి దరఖాస్తు చేసుకునే విధంగా ప్రోత్సహించాలని సూచించారు. అదేవిధంగా మండలంలో ఇందిరమ్మ ఇళ్ల ప్రక్రియను వేగవంతం చేయాలని కోరారు. సమావేశంలో ఎంపీఓ గిరిరాజు, ఏపీఓ నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీడీఓ వెంకయ్య

పారిశుద్ధ్య పనుల నిర్వహణ తప్పనిసరి

- మండల ప్రత్యేకాధికారి గోపికృష్ణ

కేశంపేట: గ్రామాల్లో పారిశుద్ధ్య పనులను క్రమం తప్పకుండా నిర్వహించాలని మండల ప్రత్యేక అధికారి గోపికృష్ణ అన్నారు. మండల పరిషత్ సమావేశ మందిరంలో బుధవారం పంచాయతీ కార్యదర్శులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లో కొనసాగుతున్న ఇందిరమ్మ ఇళ్లను త్వరితగతిన పూర్తయ్యే విధంగా చూడాలని సూచించారు. మంచినీటి సమస్య లేకుండా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. వనమహోత్సవంలో భాగంగా గ్రామాల్లో లక్ష్యం మేరకు మొక్కలను నాటేందుకు కృషి చేయాలన్నారు. మొక్కలను నాటేందుకు యాక్షన్ ప్లాన్ తయారు చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీఓ కిష్టయ్య, ఏపీఓ అజీజ్, వివిధ గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, టీఏలు పాల్గొన్నారు.

పాఠశాలలో సామూహిక అక్షరాభ్యాసం



అక్షరాభ్యాసంలో పాల్గొన్న విద్యార్థులు, ఉపాధ్యాయులు, గ్రామస్తులు

కేశంపేట: మండల పరిధిలోని కాకునూర్ ప్రాథమిక పాఠశాలలో బుధవారం సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో 1వ తరగతి విద్యార్థులకు ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు అక్షరాభ్యాసం చేయించారు. కార్యక్రమంలో నాయబ్ తహసీల్దార్ గీత, హెచ్ఎం రాజవర్ధన్‌రెడ్డి, ఉపాధ్యాయులు గీత, జాన్సీ, పద్మ, స్కూల్ చైర్‌పర్సన్ సంతోష, దేవాలయ చైర్మన్ నర్సింహ, మాజీ సర్పంచ్ లక్ష్మమ్మ, మాజీ ఉపసర్పంచ్ జంగారెడ్డి, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

'రైతులందరికీ భరోసా'

కొందుర్గు: రైతులందరికీ రైతు భరోసా డబ్బులు జమవుతాయని కాంగ్రెస్ పార్టీ కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు రోహిత్‌రెడ్డి అన్నారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వానికి ఎన్ని ఆర్థిక పరమైన కష్టాలు ఉన్నా రైతు భరోసా నిధులు అందజేస్తుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు ఇచ్చిన మాట నిలబెట్టుకుంటుందన్నారు. మరో వారం రోజుల్లో అందరి ఖాతాల్లోకి రైతు భరోసా డబ్బులు జమవుతాయని స్పష్టం చేశారు. సమావేశంలో మండల కిసాన్ కాంగ్రెస్ అధ్యక్షుడు శివరాజ్, నాయకులు నర్సింలు, ప్రదీప్, హరి పాల్గొన్నారు.

టేకులపల్లి వంతెనకు మరమ్మతులు

కొందుర్గు: మండలంలోని టేకులపల్లి వంతెనకు బుధవారం తాత్కాలికంగా మరమ్మతులు చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ.. వర్షాల ఉధృతికి గత మూడేళ్ల క్రితం టేకులపల్లి వంతెన దెబ్బతిని ప్రయాణికుల రాకపోకలకు ఇబ్బందిగా మారిందని, ఈ విషయమై స్థానికుల వినతి మేరకు నూతన వంతెన నిర్మాణానికి ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించారన్నారు. ప్రస్తుతం తాత్కాలికంగా ప్రయాణికులు ఇబ్బందులు పడకుండా ఉండేందుకు మరమ్మతులు చేపడుతున్నామన్నారు.ప్రభుత్వం నుంచి నిధులు మంజూరైన వెంటనే నూతన వంతెన నిర్మిస్తారన్నారు. కార్యక్రమంలో నాయకులు నర్సింహారెడ్డి, పైల్వాన్, అంజిరెడ్డి, రామచంద్రయ్య, శశిధర్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, శేఖర్ పాల్గొన్నారు.

అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు



లబ్ధిదారుడికి ఇంటి మంజూరుపత్రం అందజేస్తున్న నాయకులు

మొయినాబాద్‌రూరల్: రాష్ట్రంలో అర్హులందరికీ ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లు అందిస్తుందని యూత్ కాంగ్రెస్ చేవెళ్ల నియోజకవర్గ మాజీ అధ్యక్షుడు ఎలిగపల్లి శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. బుధవారం మండల పరిధిలోని బాకారంలో మంజూరైన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన లబ్ధిదారులకు సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రామకృష్ణారెడ్డి, ఇందిరమ్మ ఇళ్ల కమిటీ సభ్యుడు పంచలింగాల రాఘవరెడ్డి, నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



యోగాపై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న యోగా గురువులు, ప్రజలు

యోగా చేయండి.. ఆరోగ్యంగా ఉండండి

- పతంజలి యోగా సమితి వ్యవస్థాపకుడు శశిధర్

షాద్‌నగర్‌రూరల్: ప్రతి రోజు యోగా సాధన చేయడంతో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని పతంజలి యోగా సమితి వ్యవస్థాపకుడు పానుగంటి శశిధర్ అన్నారు. బుధవారం యోగా డేను పురస్కరించుకొని పతంజలి యోగా సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన బైక్ ర్యాలీని ఆయన జెండా ఊపి ప్రారంభించారు. యోగాపై అవగాహన కల్పిస్తూ చేపట్టిన ఈ ర్యాలీ పట్టణ ముఖ్య కూడలి నుంచి పలు కాలనీల్లో కొనసాగింది. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రతీ ఒక్కరికి యోగా సాధన ఎంతో అవసరమన్నారు. యోగా చేయడంతో అనేక దీర్ఘకాలిక వ్యాధులకు ఉపశమనం లభిస్తుందన్నారు. కార్యక్రమంలో యోగా గురువులు కుమారస్వామి, లింగమయ్య, రామయ్య, రాంచంద్రయ్య, గవయ్య, విజయ్‌కుమార్, వెంకటయ్య, రాజశేఖర్, హరిత, జోత్స్న, వనజ తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛతలో భాగస్వాములు కావాలి



ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రశంసపత్రాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే యాదయ్య

- ఎమ్మెల్యే కాలె యాదయ్య

శంకర్‌పల్లి: స్వచ్ఛతలో విద్యార్థులందరూ భాగస్వాములు కావాలని ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. బుధవారం శంకర్‌పల్లి మోడల్ స్కూల్‌లో 100 రోజుల స్వచ్ఛత కార్యక్రమం నిర్వహించగా.. ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. వంద మంది విద్యార్థులకు చిత్రలేఖనం, రంగోలి, వ్యాసరచన పోటీలు నిర్వహించి, ప్రతిభ కనబరిచిన 15 మంది విద్యార్థులకు ఎమ్మెల్యే చేతుల మీదుగా బహుమతులు, ప్రశంసపత్రాలు అందజేశారు. అనంతరం హోంకంపోస్టింగ్‌పై విద్యార్థులకు మున్సిపల్ పర్యావరణాధికారి ఆనంద్ అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు తమ ఇళ్లతో పాటు, చుట్టూ ఉన్న పరిసరాలను ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ యోగేశ్, సీఐ శ్రీనివాస్‌గౌడ్, మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ శోభారాణి, మున్సిపల్ మేనేజర్ అంజన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఐక్యతతోనే అభివృద్ధి సాధ్యం

- బీసీసేన మండల మహిళా అధ్యక్షురాలు జలజ

షాద్‌నగర్‌రూరల్: బీసీలు అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించాలని బీసీసేన మండల మహిళా అధ్యక్షురాలు జక్కుల జలజ అన్నారు. బుధవారం ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని వెల్జర్లలో బీసీసేన మండల మహిళా అధ్యక్షురాలు జక్కుల జలజ ఆధ్వర్యంలో మహిళా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. బీసీల ఓట్లతో గెలిచి అధికారాన్ని దక్కించుకున్న పాలకులు ఏనాడూ బీసీలను పట్టించుకోలేదన్నారు. సమస్యల పరిష్కారానికి బీసీలు కులాలకతీతంగా ఐకమత్యంతో ఏకతాటిపైకి రావాలని సూచించారు. బీసీ కులాలకు బీసీసేన అండగా ఉంటుందన్నారు. అనంతరం బీసీసేన మహిళా గ్రామ కమిటీని ఎన్నుకున్నారు. నూతన కమిటీ అధ్యక్షురాలిగా మంజుల, ఉపాధ్యక్షురాలిగా చాకలి అనిత, ప్రధాన కార్యదర్శిగా సద్గుణ, కార్యదర్శిగా సంజన, సహాయ కార్యదర్శిగా జ్యోతి, కోశాధికారిగా కళావతిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం నూతన కమిటీ సభ్యులకు నియామకపత్రం అందజేసి అభినందించారు. కార్యక్రమంలో జిల్లేడ్‌చౌదరిగూడ మండల బీసీసేన మహిళా అధ్యక్షురాలు జయశ్రీకాంత్, పట్టణ అధ్యక్షురాలు కాటం భాగ్యలక్ష్మి, ఫరూఖ్‌నగర్ మండల ఉపాధ్యక్షురాలు స్రవంతీరాజ్ తదితరులు పాల్గొన్నారు.



నూతన కమిటీ సభ్యులకు నియామకపత్రం అందజేస్తున్న జలజ

డిపో ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల కమిటీ ఎన్నిక



కమిటీ సభ్యులకు నియామకపత్రం అందజేస్తున్న సుందర్

షాద్‌నగర్: ఆర్టీసీ డిపో ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల నూతన కమిటీని ఎన్నుకున్నారు. బుధవారం పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో నిర్వహించిన సమావేశానికి ముఖ్య అతిథిగా ఆర్టీసీ ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంక్షేమ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి దార సుందర్ హాజరై నూతన కమిటీని ప్రకటించారు. డిపో కమిటీ చైర్మన్‌గా రాయికల్ యాదయ్య, అధ్యక్షుడిగా యాదయ్య, కార్యనిర్వాహక అధ్యక్షుడిగా రాజునాయక్, ప్రధాన కార్యదర్శిగా సుందర్‌రాజ్, ట్రెజరర్‌గా శ్రీనునాయక్, ప్రచార కార్యదర్శిగా నర్సింలు, సలహాదారులుగా మహేశ్, రాములు, వెంకటయ్య, స్వాములయ్య, పాండరి, అర్జున్‌కుమార్‌ను ఎన్నుకున్నారు. అనంతరం నూతన సభ్యులకు సుందర్ నియామకపత్రం అందజేశారు.

ప్రభుత్వ బడుల బలోపేతానికి చర్యలు

- ఎంఈఓ పురన్‌దాస్

చేవెళ్ల: ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు మండల విద్యాధికారి పురన్‌దాస్ అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని దామరగిద్ద పాఠశాలలో బడి బాటలో భాగంగా పాఠశాల ఆవరణలో మొక్కలు నాటి, బడి బయట ఉన్న కార్మికుల పిల్లలను బడిలో చేర్పించేందుకు కార్మికులకు అవగాహన కల్పించారు. ఉపాధ్యాయుల కృషితో ప్రైవేట్ పాఠశాలల నుంచి తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పిస్తున్న తల్లిదండ్రులను మాజీ సర్పంచ్ వెంకటేశంగుప్తాతో కలిసి ఎంఈఓ అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దామరగిద్ద పాఠశాల దాతలు, స్వచ్ఛంద సంస్థల సహకారంతో అభివృద్ధి చెందటం సంతోషంగా ఉందన్నారు. తరగతి గదుల డిజిటలీకరణ పనులు, మరుగుదొడ్ల ఆధునీకరణ పనులను ఎంఈఓ పరిశీలించారు. అనంతరం గ్రామస్తుడు సీహెచ్ శంకర్ తన ముగ్గురు పిల్లలను ప్రైవేట్ నుంచి ప్రభుత్వ పాఠశాలలో ఎంఈఓ, మాజీ సర్పంచ్‌ల సమక్షంలో చేర్పించటంపై ఉపాధ్యాయులు ఆయనను అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం సంగీత, ఉపాధ్యాయులు బాలాజీ, అంజనేయులు, కిరణ్‌కుమార్, వసంత, సుమజ, గ్రామస్తులు, తదితరులు ఉన్నారు.



చేవెళ్ల: కార్మికులకు అవగాహన కల్పిస్తున్న ఎంఈఓ పురన్‌దాస్, ఉపాధ్యాయులు

సర్కార్ బడుల్లోనే నాణ్యమైన విద్య: ఎంఈఓ లక్ష్మణ్‌నాయక్

షాబాద్: సర్కార్ బడుల్లో పేద విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని ఎంఈఓ లక్ష్మణ్‌నాయక్ అన్నారు. బుధవారం మండల పరిధిలోని నాగర్‌గూడ ప్రాథమిక పాఠశాలలో సామూహిక అక్షరాభ్యాసం నిర్వహించారు. అంగన్‌వాడీ నుంచి పాఠశాలలో చేరిన 16 మంది విద్యార్థులకు అక్షరాభ్యాసం చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తల్లిదండ్రులు తమపిల్లలను సర్కార్ బడులకే పంపించాలని సూచించారు. విద్యే ప్రగతికి మూలాధారమని, అందుకు ప్రతి ఒక్కరూ చదువుకునేలా చూడాలన్నారు. నిరక్షరాస్యత నిర్మూలన, విద్యాభివృద్ధి కార్యక్రమాల్లో ప్రతి ఒక్కరూ తమవంతు పాలుపంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో హెచ్ఎం కృష్ణ, మాజీ సర్పంచ్ ఈదుల కృష్ణగౌడ్, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్‌పర్సన్ రావుల లక్ష్మి, గ్రామస్తులు వెంకటేశ్, ముక్తార్, ఆబేద్, యాదయ్య తదితరులు ఉన్నారు.